

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - కాకినాడ

కార్పొరేషన్ పరిధిలో జరిగే అభివృద్ధి పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేలా పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఇంజనీ రింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న రహదారులు, డ్రయినేజీలు, సంజయ్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయా అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించారు. ఈ పర్యటనలో ఇఇ మాధవీ, డిఇ సుబ్బారావు, ఎఇ వై.నాగేశ్వరరావుపాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పిఠాపురంపైనే అందరి చూపు

- బరిలో కీలక నేతలు
- పోటీకి జనసేనాని సన్నాహాలు
- ముద్రగడను దింపేందుకు వైసిపి యత్నం





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పిఠాపురం నియోజకవర్గంలో మారుతున్న పరిణామాలు రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నాయి. ప్రస్తుతం ఈ అసెంబ్లీ స్థానంపై అందరి కన్ను పడింది. కీలక నేతలు ఇక్కడి నుంచే బరిలోకి దిగాలని ఆలోచనలు చేస్తున్నారు. ఇప్పటికే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దానికి తగ్గట్టుగా సన్నాహాలు చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన ఇక్కడ నుంచి బరిలో నిలుచుంటారని ఆ పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. దానికి అనుగుణంగా పార్టీ కార్యాలయంతోపాటు ఇతర ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ బరిలో ఉంటే ఆయనకు తగిన అభ్యర్థిని రంగంలోకి దించాలని వైసిపి కూడా భావిస్తుంది. దానికి అనుగుణంగానే కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం గానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ బరిలో దిగే అవకాశం ఉంటుందని ప్రచారం మొదలైంది. ఇప్పటికే వైసిపి ఆ విధమైన లీకులు కూడా ఇస్తుంది. త్వరలోనే ముద్రగడ వైసిపి తీర్థం పుచ్చుకుని పోటీలో ఉంటారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఈ నియోజకవర్గంలో సుమారు 2.30 లక్షల ఓటర్లున్నారు. ఇందులో దాదాపుగా 90 వేలకు పైనే కాపు ఓటర్లున్నారు. కాపులు అత్యధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఎక్కువ సార్లు అదే సామాజిక వర్గానికి చెందిన నాయకులు గెలుపొందారు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం గతంలో విజయం సాధించడంతోనే కీలక నేతలు ఇక్కడ పోటీకి సై అంటున్నారు. ఈ నేపథ్యంలోనే మరోసారి జనసేనకు సునాయాసంగా విజయం వరించే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. అందు చేతనే తొలుత భీమవరం అనుకున్న పవన్ వివిధ సర్వేల తర్వాత పిఠాపురం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. దీంతో గత రెండు రోజులుగా రాజకీయ సమీకరణాలు మారడంతో అనూహ్యంగా ముద్రగడ తెరమీదకు వచ్చారు. తొలుత పవన్ వచ్చి కలిసిన తర్వాత ముద్రగడ జనసేనలో చేరి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అందుకే ఇప్పటి వరకు ముద్రగడ, ఆయన అనుచరులు ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనేది పరిశీలకుల భావ. రెండు రోజుల క్రితం ముద్రగడ విడుదల చేసిన లేఖతో జనసేనలో చేరే అవకాశం లేదని తేలిపోయింది. పవన్ పోటీపై ఊహాగానాల నేపథ్యంలో ఆయనపై ముద్రగడను పోటీలో నిలిపేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు కొనసాగిస్తున్నది. ఆయన వైసిపిలోకి వస్తే కాపులపై ప్రభావం చూపిస్తుందని, తద్వారా పవన్‌ను ఓడించొచ్చునే అంచనాతో అధికార పార్టీకి చెందిన నేతలు ఆయనతోనే చర్చలు జరుపుతున్నారు.కొంతకాలం క్రితం కాకినాడ ఎంపీ వంగా గీతను ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా నియమించగా స్థానిక ఎంఎల్ఎ పెండెం దొరబాబును కలుపుకుని ఆమె పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మారుతున్న సమీకరణాల్లో భాగంగా ఆమెను ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించి వేరే చోట అవకాశం ఇవ్వాలనే ఆలోచన అధిష్టానం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎవరు పోటీ చేసినా పిఠాపురం నియోజకవర్గ ఓటర్ల విలక్షణ తీర్పుకు సిద్ధం కాక తప్పదు.



ర్యాంప్ సర్వే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

ర్యాంప్ సర్వే వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఇ) మెరుగు పరచడం, అభివృద్ధిని వేగవంతం చేసే నిమిత్తం చేపట్టిన ర్యాంప్ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యా లయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి మూడవ దశ రీసర్వే, ఇనామ్, అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఎన్ఆర్ఇజిఎస్, కరువు మండలాల్లో పని దినాలు, తాగు, సాగు నీరు, పరిశ్రమల శాఖలో ఎంఎస్ఎంఇ క్లస్టర్‌లకు భూ కేటాయింపు, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖలో అమల వుతున్న జెఎఎస్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ వంటి ఇతర ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు జాయింట్ కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ సిపి ప్రవీణ్ ఆదిత్య, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ఎంఎస్ఎంఇలను మెరుగు పరచడం, అభివృద్ధిని వేగవంతం చేసే నిమిత్తం ర్యాంప్ సర్వే ప్రక్రియ జిల్లాలో మార్చి ఒకటి నుంచి ప్రారంభమైం దన్నారు. ఇఎంఎస్ఎంఇ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని వివిధ సంస్థలను డిజి టల్ ప్లాట్ ఫామ్‌లోకి తీసుకువచ్చి ఎపిఎం ఎస్ఎంఇ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేయడం జరుగుతుందని ఆమె వివరించారు. అధికారులు ఈ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టి మార్చి 20 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో జరుగుతున్న హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా వైద్య, ఆరోగ్య శాఖలో అమలు చేస్తున్న ఇతర కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో సాగు, తాగు నీరులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరసింహ నాయ క్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాధా కృష్ణ, ఎడి సర్వే బి.లక్ష్మినారాయణ, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ఎం.శ్రీని వాసు, ఎపిఐఐసి జెడి ఎం.ఎ.రామణారెడ్డి, పరిశ్రమలు శాఖ ఎడి కె.కృష్ణార్జునరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ర్యాంప్ సర్వే పోస్టర్ ఆవిష్కరణ

ప్రభుత్వం చేపట్టిన ర్యాంప్ (రైజింగ్ అండ్ ఎక్సిలేటరింగ్ ఎంఎస్ఎంఇ పెర్ఫార్మెన్స్) సర్వేకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా పరిశ్రమల శాఖ అధికారులుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఇ) మెరుగు పరచడం, అభివృద్ధిని వేగవంతం చేసేందుకు నిర్వహిస్తున్న ర్యాంప్ సర్వేపై ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వేత్తలందరికి విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు శాఖ ఎడి కె.కృష్ణార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

డిఎంఇ దృష్టికి శానిటేషన్ వర్కర్ల సమస్య

ప్రజాశక్తి - కాకినాడ

గత 28 రోజులుగా వివిధ రూపాల్లో తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న జిజిహెచ్ శానిటేషన్ వర్కర్లు శనివారం డిఎంఇని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్ విజయ్ కుమార్ డిఎంఇతో మాట్లాడుతూ కృష్ణ కన్స్ట్రక్షన్స్ అనే కాంట్రాక్టర్ కార్మికులకు చట్ట ప్రకారంగా ఇవ్వాల్సిన పిఎఫ్‌ను కూడా కార్మికుల జీతాల నుంచి కట్ చేస్తున్నారని తెలిపారు. చట్ట ప్రకారం కార్మికుని జీతంలో పిఎఫ్ వాటాకు అదనంగా సంబంధిత కాంట్రాక్టర్ తన వాటాగా పిఎఫ్ ఖాతాకు జమచేయాల్సివుందన్నారు. అయితే ఇక్కడ కాంట్రాక్టర్ చెల్లించాల్సిన వాటాను కూ డా కార్మికుల జీతాల నుంచి కట్ చేస్తున్నారని వివరించారు. ఈ విషయంపై కలుగుచేసుకుని చట్ట ప్రకారం న్యాయం చేయాలని కోరారు. గత 25 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నామని, కరోనా సమయంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి తమ విధులను నిర్వర్తించామని తెలిపారు. ఈ సందర్భంగా డిఎంఇ డిబిఎల్.నరసింహ మాట్లాడుతూ ఈ సమస్యపై కాంట్రాక్టర్‌తో మాట్లాడి కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, వివిఎస్ కుమార్, రవిబాబు, శేషుబాబు, లక్ష్మీప్రియ, కుమారి, పుష్ప, వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.



డిఎంఇ తో మాట్లాడుతున్న జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు

మోకాళ్లపై హమాలీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీ కూలీలు

ఎగుమతి కూలి రేట్లు పెంపుదల కోసం బేవరేజెస్ హమాలీలు చేపట్టిన ఆందోళనలో భాగంగా శనివారం స్థానిక డిపో వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూని యన్ ప్రధాన కార్యదర్శి వి.అప్పల రాజు మాట్లా డుతూ మద్యం ఎగుమతి, దిగుమతి పనులు ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలు సమకూర్చడంలో హమాలీలు కీలక పాత్ర వహిస్తున్నారని అన్నారు. అయిన ప్రభుత్వం ద్వారా కూలీలకు ఏవిధమైన సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. హమాలీలు దిగుమతి చేస్తున్నప్పుడు బీర్ బోటల్స్ పగిలి గాయాలపాలై వైద్యం కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన వస్తుందని తెలిపారు. కార్పొరేషన్ నుంచి ఏ విధమైన ఆర్థిక సాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ వచ్చు చాలీ చాలని కూలితో హమాలీ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితిలో కార్పొరేషన్ కాంట్రాక్టర్‌ను పిలిపించి చర్చలు జరిపి ఎగుమతి కూలి రేట్లు పెంచి హమాలీ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు మాట్లాడుతూ ఎగుమతి కూలి పెంపుకై రాష్ట్ర కమిటి పిలుపు మేరకు 5వ తేదన చలో విజయవాడ ఎండి కార్యాలయానికి హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూని యన్ అధ్యక్షులు బి.ఆదినారాయణ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వైసిపి అరాచకాన్ని అణిచేందుకు ప్రజలు సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

వైసిపి అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందని, వైసిపి అరాచక పాలన నుండి రాష్ట్రాన్ని కాకినాడ నగరాన్ని కాపాడవలసిన బాధ్యత నేడు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జగన్ అసమర్థ పాలన వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలోకి నెట్టబడిందని తెలిపారు. ప్రశాంత వాతావరణం గల కాకినాడ నగరాన్ని నేడు గుండాల, రౌడీల, డ్రగ్స్, నగరంగా మార్చి నగర ప్రతిష్టను ద్వారంపూడి దిగజార్చడని, ద్వారంపూడి అక్రమ సంపాదన కోసం కాకినాడ నగరాన్ని డ్రగ్స్ గంజాయి నగరంగా మార్చి యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాడన్నారు. భూములు కనిపిస్తే చాలు వైసిపి నాయకులు చేతిలో కబ్జాలకు గురవుతున్నాయని, ప్రభుత్వ భూములను టిడిఆర్.బాండ్ల రూపంలో దోచుకుతింటున్నారని అన్నారు. మోసపూరిత మాయ మాటలతో ప్రజల్ని మరొక్కసారి మోసగించడానికి ద్వారంపూడి ప్రయత్నిస్తున్నాడన్నారు. కాకినాడ నగరంలో ద్వారంపూడి అవలంభిస్తున్న విధ్వంసకర పాలనను తరిమికొట్టి టిడిపి-జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతి కార్యకర్త సైనికులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, నృసింహదేవర విశ్వనాథం, రహీమ్, గదుల సాయిబాబా, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు



మాట్లాడుతున్న ఎపి ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కేరి

ఔషధ రంగం (ఫార్మసీ)లో వస్తు న్న అధునాతన ఆవిష్కరణలపై ప్రతి ఫార్మసిస్టు అవగాహన కలిగి ఉండాలని ఎపి ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎం.విలి యం కేరి అన్నారు. కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో రాష్ట్రంలోని ప్రయివేట్ ఫార్మసిస్టులకు మూడవ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ సువర్ణజ్యోతి అధ్యక్షతన జరిగిన సెమినార్లో రిజిస్ట్రార్ కేరి మాట్లాడారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఫార్మసీరంగంలో అనేక సాంకేతిక పరిశోధనలు ఆవిష్కృతం అవుతున్నాయని, వాటి పట్ల ఫార్మసిస్టులు ప్రతిరోజు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజారోగ్యానికి మేలు చేసేందుకు ఫార్మసీ రంగంలో ఉన్న మెలకువలు తెలుసుకుంటేనే ఫార్మసిస్టులు తగిన విధంగా ప్రజలకు మేలు చేయగలరని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు కళాశాల నుంచి వచ్చిన ఫార్మసిస్టులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరంగి ఫార్మసీ కళాశాల చైర్మన్ దున్న జనార్ధనరావు, కరస్పాండెంట్ పి. కనకరాజు, ఎపి ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ దుర్గాప్రసాద్, డైరెక్టర్లు కల్కి మూర్తి, గుండు సాయికృష్ణ, పాల్గొన్నారు.

వికలాంగ బాలలకు గృహ ఆధారిత విద్య

ప్రజాశక్తి - పెద్దాపురం



విద్యార్థి పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

స్థాని భవిత కేంద్రానికి వచ్చి చదువుకోలేని బాలలకు ప్రతి శనివారం గృహ ఆధారిత విద్య అందించబడుతుందని ఎంఇఒలు కెఆర్‌కె.చౌదరి, ఇ.ప్రభాకర్ శర్మ తెలిపారు. శనివారం పట్టణానికి చెందిన తిరుమలదేవికి, కడిమెళ్ళ శివసాయి అఖిలేష్‌కు సహిత ఉపాధ్యాయులు బి.ఆనందరావు, వి.దుర్గాప్రసాద్ రెడ్డి గృహ ఆధారిత విద్యను అందిస్తున్న సమయంలో వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రానికి రాలేని నడవలేని పిల్లలు, మానసిక స్థితి బాగా లేని పిల్లలు ఐదుగురికి గృహ ఆధారిత విద్య అందించబడుతుందన్నారు. ఈ సందర్భంగా వారు పిల్లల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారి ఆరోగ్య స్థితి, అలవెన్స్ వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యా హక్కును కాపాడుకోవడం అవసరం

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ళ సుబ్బారావు

పేదలకు అందాల్సిన విద్య దూరం అవుతోందని అందువల్ల విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షించుకోవాలని ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు అన్నారు. శనివారం కాకినాడలోని ఓ ప్రయివేట్ హోటల్లో పిటిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కొల్లపు వేణు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లా డుతూ దేశంలో అన్ని రాజ్యాంగ ప్రకారం నడుచుకుంటే విద్య మాత్రం ఎందుకు రాజ్యాంగం ప్రకారం నడుచుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే విద్యా రంగాన్ని బలోపేతం చేసి విద్యను పేదలకు దగ్గర చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిటిఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.కిరణ్‌కుమార్, నాయకులు పరమట భారతి, ఎస్‌కె కరీమున్నీసా, కాకిలేటి రవీంద్ర, బావిశెట్టి రామకృష్ణారావు, పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్, పైపులైన్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట



మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

మండలంలోని రాజపూడి, గుర్రప్పాలెం గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో నిర్మించిన వాటర్ ట్యాంకు, పైపులైన్‌ను ఎంఎల్ ఎ జ్యోతుల చంటి బాబు ప్రారంభించారు. నియోజక వర్గ వైసిపి ఇన్‌ఛార్జ్‌గా తోట నరసింహంను నియమించిన నాటి నుంచి ఎంఎల్ఎ చంటిబాబు అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అయితే రెండు నెలల క్రితం మర్రిపాక, ఇర్రిపాక గ్రామాలకు వెళ్లే రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో కన్పించిన ఆయన తిరిగి మరో రెండు నెలల అనంతరం శనివారం గుర్రంపాలెం, రాజపూడి గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంకులు, పైపులైన్ ప్రారంభోత్సవంలో తలుక్కున మెరివడం చర్చానీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి నాగబాబు, వైస్ ఎంపిపి నక్క శ్రీను, వుయ్యూరి నాని, బూసాలా విష్ణుమూర్తి, జనపరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - పిఠాపురం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం తొలి పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 851 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 824 మంది హాజరయ్యారు. 27 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు కనీస మౌళిక సదుపాయాలతోపాటు, వైద్య సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

పోలియో చుక్కల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి - సామర్లకోట


ఆదివారం నుంచి మూడు రోజులపాటు సామర్లకోట పట్టణ పరిధిలో 0- 5 ఏళ్ల లోపు 3645 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రామారావు చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో 36 పోలియో చుక్కలు పంపిణీ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెండు మొబైల్ బూత్‌లు తిరుగుతాయని, రెండు ట్రాన్సిట్ బూత్‌లు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఎస్ఒ పెంకే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయి పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 31వ తేదీ లోపు మొత్తం బకాయి ఉన్న ఇంటి, ఖాళీ స్థలం పన్నులు ఏక మొత్తంలో చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పట్టణ ఆస్థి యజమానదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్టూ'నిజం'



మార్చి 3న అంతర్జాతీయ వినికిడి దినోత్సవం

శెట్టిబలిజకు ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘీయులు

కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ సీటును శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వారికే కేటాయించాలని, లేనిపక్షంలో స్వతంత్ర్యంగా పోటీ చేస్తామని శెట్టిబలిజ జన జాగృతి సేవా సంఘం, బిసి వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా డిమాండ్ చేశాయి. కాకినాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు వాసంశెట్టి భీమరాజు, సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కర్రి గోపాలకృష్ణ మాట్లాడారు. కాకినాడ రూరల్ అసెంబ్లీ సీటు గత కొంతకాలంగా శెట్టిబలిజ సామాజిక వర్గీయులకు ఏదో ఒక పార్టీ కేటాయిస్తుందని అన్నారు. అయితే ఈ దఫాలు అది జరగలేదని అన్నారు. రూరల్ సీటును శెట్టిబలిజలకే కేటాయించాలని, ఇతర నియోజకవర్గాల్లో బిసి సామాజిక వర్గానికి కేటాయించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు.కాకినాడ రూరల్లో శెట్టిబలిజలకు సీటు కేటాయించని పక్షంలో తామే ఒక అభ్యర్థిని ఎంపిక చేసి స్వతంత్రంగా పోటీ చేసి తమ ఓట్లను తామే వేసుకుంటామన్నారు. శెట్టిబలిజలను అనిచివేతకు కుట్ర జరుగుతోందని, వారికి మా సత్తా చూపిస్తామని శెట్టిబలిజ జన జాగృతి సేవా సంఘం మహిళా అధ్యక్షురాలు రాయుడు దుర్గ హెచ్చరించారు. సీటు కేటాయించిన వారిని ఆరాధిస్తామని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో ఆయా సంఘీయులు రాయుడు సుధాకర్, మేడిశెట్టి లక్ష్మణరావు, పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద చదువుకునే వారికి ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి - సామర్లకోట



విద్యార్థి పుస్తకాన్ని పరిశీలిస్తున్న సిఎంఒ

ఇంటి వద్దే ఉండి విద్యను అభ్యసించే వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని సహిత విద్య జిల్లా సమన్వయకర్త సిఎంఒ చామంతి నాగేశ్వరరావు, ఎంఇఒ-2 పి.పుల్లయ్య తెలిపారు స్థానిక తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్లో పేరు నమోదు చేసుకుని స్కూలుకు వెళ్ల కుండా ఇంటివద్దే విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని పి.సిరిలక్ష్మి ఇంటికి శనివారం వారు వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రతి శనివారం భవిత సిబ్బంది అనిత, పద్మ ద్వారా పదిమంది వికలాంగ విద్యార్థులకు ఇంటి వద్దనే విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాకానుక, అమ్మఒడి వంటి పథకాలు వర్తిస్తాయని తెఇపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడి విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని జగన్నాథపురంలో ఒక వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. తానెం విష్ణు భార్య, లక్ష్మి (29) శుక్రవారం రాత్రి ఉరిపోసుకుని మృతి చెందినట్లు భర్త విష్ణు తెలుపుతున్నాడని చెప్పారు. ఆమెపై అనుమానంతో భర్త విష్ణు కొట్టినందు వల్లే ఆమె చనిపోయిందని, ఉరి తాడును తానే కోసినట్లు తెలుపుతున్నాడని పోలీసులు తెలిపారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

గోదావరి కాటన్ బ్యారేజ్‌పై శనివారం సైకిల్‌పై వెళుతున్న విద్యార్థులను కారు ఢీకొని ఐదుగురికి గాయాలయ్యాయి. కొవ్వూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మండలంలోని మద్దూరు లంక గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ఎవరి సైకిళ్లపై వారు కాటన్ బ్యారేజ్ మీదుగా రాజమండ్రి వెళుతుండగా రాజమండ్రి వైపు నుంచి వస్తున్న కారు వారి సైకిళ్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గంజాయి కేసులో యువకులకు రిమాండ్

ప్రజాశక్తి-గోపాలపురం

గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారిని కొవ్వూరు కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు కొవ్వూరు డిఎస్‌పి కెసిహెచ్.రామారావు తెలిపారు. శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 1న తేదీ మూడు గంటల సమయంలో గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జగన్నాథపురంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సిహెచ్.గౌతం రాజు, కెఎస్.విజయ్ కుమార్ విశాఖ జిల్లా ఏజెన్సీ నుంచి 4.290 కేజీల గంజాయి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని కొవ్వూరు కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో సిఐ పి.బాల సురేష్ బాబు, ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.

రూ.7.5 లక్షలు అపహరణ నిందితుల అరెస్ట్, సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-గోపాలపురం

కాకినాడలో అపరాలు అమ్ముకుని తెలంగాణ వెళుతున్న వ్యక్తి బ్యాగ్‌లో రూ.7.50 లక్షల నగదు అపహరించిన వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు కొవ్వూరు డిఎస్‌పి కెసిహెచ్.రామారావు తెలిపారు. శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. తెలంగాణకు చెందిన వైట్ల సాయి బాబా అపరాల వ్యాపారి వద్ద గుమస్తా. అపరాలను కాకినాడ తీసుకు వచ్చి అమ్మగా వచ్చిన డబ్బును రూ.7.5 లక్షను బ్యాగులో పెట్టుకుని కాకినాడ నుంచి రాజమండ్రి వచ్చారు. సాయిబాబాకు పరిచయస్తులైన మండపేట గ్రామానికి చెందిన ఎర్రేటి విజయ కుమార్, ఆమె అల్లుడు మాడ మణికుమార్ ఆయనకు కనిపించారు. బ్యాగులో డబ్బులు ఉన్న విషయాన్ని గుర్తించారు. వారు కూడా తెలంగాణ వస్తామని చెప్పి అందరూ కలిసి రాజమండ్రిలో బస్సు ఎక్కారు. 29వ తేదీ తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో గోపాలపురం చెక్ పోస్ట్ సెంటర్ వద్దకు వచ్చేసరికి సాయిబాబా నిద్రలో ఉండగా వారిద్దరూ డబ్బుతో ఉన్న బ్యాగు అపహరించి దిగిపోయారు. దీంతో సాయిబాబా గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఒకటవ తేదీన ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిఐ పి.బాలసురేష్ బాబు, ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 7.45 లక్షలు రికవరీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గోపాలపురం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం గోపాలపురం శివారు పొగాకు బోర్డు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు..చాగల్లు గ్రామానికి చెందిన వై.ఆంజనేయులు (32) బైకుపై జంగారెడ్డిగూడెం వెళుతుండగా గోపాలపురం పొగాకు బోర్డు సమీపంలో ఉన్న మలుపు వద్ద వెనుక నుంచి లారీ బలంగా ఢీ కొట్టంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఆంజనేయులకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-నల్లజర్ల

రెండు బైకులు ఎదురు, ఎదురుగా ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం రాత్రి 8 గంటలకు నల్లజర్ల ప్రకాశరావుపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సింగరాజుపాలెం గ్రామానికి చెందిన దయ్యాల సతీష్ నల్లజర్ల వైపు బైకుపై వెళుతుండగా తణుకు గ్రామానికి చెందిన కమలాకర్ నల్లజర్ల వైపు నుండి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్నారు. అతి వేగంగా ఒకరిని ఒకరు ఢీకొనడంతో కమలాకర్ కుడికాలు మూడు చోట్ల విరిగింది. వెంటనే స్థానికులు స్పందించి 108లో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బోటు తిరగబడి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రమాదవశాత్తు సముద్రంలో బోటు తిరగబడి మత్స్యకారుడు మతి చెందిన సంఘటన ఇది. ఎస్ఐ కెఎం.జోషి తెలిపిన వివరాలు ఇవి. అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు సముద్రంలో వేట నిమిత్తం శనివారం ఉదయం పంతాడి పెంటయ్యకు చెందిన ఫైబర్ ఇంజన్ బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు.చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్ప తీరం సముద్రంలో వారు వేటాడుతుండగా సముద్రపు అలలకు బోటు తిరగబడడంతో నక్కా రామేశ్వరానికి చెందిన కొప్పనాతి కోదండం(40) ప్రమాదవశాత్తు నీట మునిగి మతి చెందాడు. మిగిలిన ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారని తెలిపారు.మతుని సోదరుడు శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పెరిగిన పొలిటికల్ హీట్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఒక వైపు అధికార యంత్రాంగం ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, నిర్వహణ తదితర ఏర్పాట్లపై కసరత్తు పూర్తి చేసిన విషయం విదితమే. మరో వైపు అధికార విపక్ష పార్టీలు ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించాయి. మరి కొన్ని స్థానాలు ప్రకటించాల్సి ఉంది. ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు ఆశావహులు ఆయా పార్టీల అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికార పార్టీ ఇప్పటికీ కొన్ని స్థానాల్లో సిట్టింగ్‌లకు సైతం స్పష్టత ఇవ్వకపోవటం పలు అనుమానాలకు దారి తీస్తోంది. కొత్త అభ్యర్థులను తెరపైకి తీసుకొస్తారా..? లేదా తుది దశలో వారికే కేటాయిస్తారా..? అనే చర్చ జరుగుతోంది. అభ్యర్థులు ఖరారైన స్థానాల్లో ఎన్నికల కోడ్‌కు ముందే హోరెత్తిన ప్రచారం ప్రజలను విస్తు గొలుపుతోంది. మరోవైపు జనసేన, టిడిపి నేతల మధ్య జిల్లా స్థాయిలో వార్ మొదలైంది. రాజమహేంద్రవరం రూరల్ స్థానం ఆశించి భంగ పడిన జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ నిరసన ర్యాలీ సైతం నిర్వహించడంతో ఆ రెండు పార్టీల పర్సపర సహకాంంపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. మరోవైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచే పోటీ చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం జోరుగా జరుగుతోందని తెలుస్తోంది. ధరలు, ఛార్జీలు, పన్నుల భారాల నేపథ్యంలో ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న అధికార వైసిపి, అధికార పార్టీని ఓడించటమే లక్ష్యం అంటూ జతకట్టిన జనసేన-టిడిపి ఏ మేరకు సఫలీకృతం అవుతాయో వేచి చూడాల్సి ఉంది.

తప్పుల తడకలతో ఇబ్బందులు

పేదలకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో తగిన సౌకర్యం కల్పించడం లేదని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. పేదలకు ఇచ్చిన పట్టాల్లో పేర్లు, సర్వే నంబర్లు, స్లాట్ నెంబర్, హద్దులు తప్పుగా ఉండడంతో రిజిస్ట్రేషన్ కావడం లేదు. ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత రిజిస్ట్రేషన్‌కు ఇచ్చిన తేదీన కార్యాలయానికి వచ్చినా తిరస్కరణకు గురవుతుండటంతో లబ్ధిదారులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. మరోపక్క గ్రామాల్లో కరెంట్ కోతల కారణంగా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సాంకేతిక సమస్యలు లేకుంటే 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్తున్నారు. కాగా రోజూ సర్వర్ సమస్యతో నిరీక్షించాల్సి వస్తోందని లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాదైనా కాల్వల ఆధునీకరణ సాధ్యమేనా

రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని జిల్లా రైతాంగం అభిప్రాయ పడుతోంది. గోదావరి నదీ పరీవాహక ప్రాంతం కావడంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విదితమే. బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి చేస్తామంటూ ఇప్పటికి పలుమార్లు వాయిదాలు వేసింది. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని ప్రశ్నించలేని అసమర్థతను వైసిపి ఆత్మవిమర్శ చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఏటా వేసవి పనులు నిర్వహించి కాల్వల ఆధునీకరణ, తూటు కాట తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్దాల కాలంగా ఆనయవాయితీగా వస్తోంది. రబీ సాగుకు సాగునీటి ఇబ్బందులు పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. సాగు నీటి సలహా మండలి సమావేశంలో ప్రతిపాదించిన నిధులు ఇప్పటిద వరకూ విడుదలకు నోచుకోలేదు. మరోవైపు ఈ ఏడాది డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు చేస్తారా.? లేదా అనే సందేహమూ వెంటాడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు ఈ వేసవిలో కాల్వల ఆధునీకరణ చేపట్టాలని రైతాంగం కోరుతోంది.



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న ఎండలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండలు క్రమ క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి వేడి గాల్పులు ఊపందుకోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మార్చి ప్రారంభంలోనే ఇలా ఉంటే మే నెలలో తార స్థాయికి చేరతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికి తోడు అనధికార విద్యుత్ కోతలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాలనా యంత్రాంగం ఇప్పటికైనా చొరవ చూపి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

శృంగార వల్లభ స్వామికి రూ.5.15 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శృంగార వల్లభ స్వామికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.4,11,640, అన్నదాన విరాళాల ద్వారా రూ.95,518, కేశఖండన ద్వారా రూ.8,400, తులాభారం ద్వారా రూ.300 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డీ శ్రీనివాసరావు తెలిపారు. యాత్రికులకు ఆలయ చైర్మన్ కర్రి వెంకటజగదీశ్వరరావు, ధర్మకర్తలు, ఎంపిటిసి సభ్యులు కుంచే బుచ్చిరాజు, అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్తమాచార్యులు, సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు సహాయ సహకారాలు అందించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులే కీలకం

ప్రజాశక్తి - పిఠాపురం

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని రోడ్లు భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత అన్నారు. శనివారం పట్టణంలో సిఎస్ఆర్ నిధులు రూ.70 లక్షలు వ్యయంతో నూతనంగా నిర్మించిన పట్టణ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఎంఎల్ఎ పెండెం దొరబాబుతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలో పిఠాపురం, కిర్లంపూడి, తిమ్మాపురం పోలీస్టేషన్లకు సుమారు రూ.3 కోట్లు నిధులతో నూతన భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. ఆరు నెలల వ్యవధిలోనే నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించి ప్రారంభించడానికి సహకరించిన ప్రజా ప్రతినిధులకు, ఇంజనీరింగ్ సిబ్బందికి ఎస్‌పి సతీష్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ మురళీమోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రాజా, ఎంపి గీత, ఎంఎల్ఎ దొరబాబు

స్కానింగ్ సెంటర్‌లపై నిఘాను పెంచాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లపై డికాయ్ ఆపరేషన్లతో రహస్య నిఘాను మరింత విస్తృతం చేయాలని జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య అధికా రులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కోర్టు హాలులో పిసి, పిఎన్‌డిటి చట్టం అమ లుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో క్రొత్తగా ఒక అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటకు అనుమతి, రెండు సెంటర్ల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కొరకు అందిన ధర ఖాస్తులపై క్షేత్రాధికారుల పరిశీలన నివేది కలను సమీక్షించి కమిటీ ఆమోదం తెలి పింది. అలాగే సెంటర్ల చిరునామా, యం త్రాలు, సిబ్బందికి సంబందించిన మార్పులు, సెంటర్ల మూసివేతకు అనుమతి కోరుతూ అందిన 9 ధరఖాస్తులకు అంగీకారం జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ శిశువుల పట్ల వివక్ష ధోరణి సమాజంలో అక్కడక్కడా ఇంకా కొనసాగుతోందని, దీనిని పూర్తిగా అరికట్టేందుకు పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ చట్టంలో నిర్ధేశించిన అంశాలను జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లు ఖచ్చితంగా పాటిం చేలా మరింత నిశిత పర్యవేక్షణ పాటించాలని కోరారు. గడచిన రెండు నెలల్లో డివిజనల్ స్థాయి అధికారులు స్కానింగ్ సెంటర్లపై 8 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిం చారని, జిల్లాలో ఆడ శిశు జననాల గణాంకాలను విశ్లేషించి తక్కువ స్థాయిలో ఉన్నట్లు గమనించిన ప్రాంతాల్లో ఈ రహస్య కార్యకలా పాలను మరింత ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. చట్టం పటిష్ట అమలుతోపాటు, లింగ వివక్ష ధోరణలను సమూలంగా రూపుమా పేందుకు సమాజ దృక్పధంలో మార్పుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశం లో డిఎంహెచ్‌ఓ డాక్టర్ జె.నరశింహనాయక్, దిశ డిఎస్‌పి ఆర్.రామచంద్రరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిత, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎస్.స్వప్న, డిఐఒ డాక్టర్ కె.రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మహారాణి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -5 ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ కాలనీలో శనివారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఏరోజు చెత్త పోగులను ఆ రోజే తొలగించాలని, డ్రెయిన్‌లో చెత్త, మట్టి వేయడం వల్ల మురుగునీరు ప్రవహించక దోమలు పెరిగి ప్రజలు రోగాల భారిన పడతారని అవగాహన కల్పించారు. కాలనీలోని మున్సిపల్ పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మేడిశెట్టి తాతాజీ పాల్గొన్నారు.

బడ్జెట్ అంచనాలకు ఆమోదం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గంటి మల్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2023-24లో చేపట్టనున్న పనులకు మండల పరిషత్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. వివిధ గ్రాంట్లకు సంబంధించి రూ.28 లక్షల వ్యయంతో 5762 పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సూర్యరెడ్డి, తిరుమల రాయులు, ఎంపిడిఒ ఎం.ప్రేమ్‌సాగర్, వివిధ గ్రామాల ఎంపిటిసి సభ్యులు. సర్పంచులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

7న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈ నెల 7న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తామని ఇఒ కె.రామచంద్రమోహన్ తెలిపారు. తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రసాద్ పథకంలో మంజూరు చేసిన రూ.20 కోట్లతో నిత్య అన్నదాన విభాగం మూడు అంతస్తుల భవనం, దర్శనం క్యూ లైన్లు కాంప్లెక్స్, బాత్రూములు, టాయిలెట్లు కాంప్లెక్స్, రెండు ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు వంటి వాటికి ఈ నిధులను వెచ్చించనున్నట్లు తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లోనే సంబంధిత అనుమతులు వస్తాయని తెలిపారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న కుడిపూడి

క్యాన్సర్ బాధితునికి ఎఎంసి చైర్మన్ కుడుపూడి సాయం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని చొల్లంగి గ్రామానికి చెందిన క్యాన్సర్ రోగి మాతా జాన్‌కు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆర్థిక సాయాన్ని అందించారు. శనివారం తమ అభిమానులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి బాధితునికి రూ.10వేలు నగదు, బియ్యం, నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చేయి కోల్పోయిన బాధితుడికి మరింత మంది అండగా నిలవాలన్నారు. పెద్ద మనస్సుతో సాయం అందించిన ఆయనను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు, వైసిపి గ్రామ కమిటీ కన్వీనర్ వరిపల్లి శివాజీగణేష్, నాయకులు మాస శ్రీనివాస్, వార సూర్యకుమారి, దడాల సువర్ణలత, కేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం


ప్రజాశక్తి - పెద్దాపురం

తాగు నీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు అన్నారు. శనివారం మండలంలోన తూర్పుపాకల గ్రామంలో రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మంచినీటి బోర్వెల్, పైపులైన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు చొరవతో ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పదాల వీరరాఘవులు, మాదిరెడ్డి రాంబాబు, పాల్గొన్నారు.

అసత్యాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరు

ప్రజాశక్తి - కోటనందూరు

సిఎం జగన్‌పై చంద్రబాబు, పవన్ చేస్తున్న అసత్య ప్రసారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం కాకరపల్లి గ్రామంలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళను రాజకీయం గాను ఆర్థికంగానూ బలోపేతం చేసిన ఘనత జగన్‌దేనని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో సంక్షేమ, అభివృద్ధి దిశగా అడుగులు వేసిం దని తెలిపారు. పార్టీలకతీతంగా అందరికీ మేలు చేకూర్చారని, విద్యా , వైద్య, రంగాల్లో అత్యధికమైన నిధులు కేటాయించి ప్రజలకు మంచి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంపిపి యల్ల.శ్రీనివాస్, వైస్ ఎంపిపి బి.గంగాధర్, నాయకులు లంక ప్రసాద్, మాకినేడు బాబు, వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణజి, తదితరులు పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న మంత్రి


స్వాగతం పలుకుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రో కబడ్డీ రిఫరీ మురళికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - సామర్లకోట

జగ్గంపేట ఉన్నత పాఠశాల పిడి బోగిళ్ల మురళీకుమార్ ప్రో కబడ్డీలో వరుసగా 10వసారి రిఫరీగా పనిచేసి తిరిగి వచ్చిన సందర్భంగా శనివారం మధురపూడి ఎయిర్ పోర్టులో ఆయనకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీను, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, సీనియర్ క్రీడాకారులు నిమ్మకాయల కిరణ్, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు శ్రీను, పవన్‌కుమార్, అజయ్‌కుమార్, బాబీ, రాజ్‌కుమార్, సుధీర్, వెంకట్‌నాథ్, మనోహర్, జాతీయ ఖోఖో కోచ్ పోతుల సాయి ప్రసాద్ స్వాగతం పలికారు.